### కామెడీ కథ

# రెండుసార్లు చచ్చిన మనిషి

మోర్తల ప్రభాకర్ రెడ్డి

"నా చావుని వీడియో తీయాలి" నాటకీయంగా అన్నాడు బంగారయ్య. అన్నిటినీ డ్రెమటైజ్ చేయడం అతనికున్న చాలా వెధవలవాట్లలో ఒకటి.

"ఎప్పుడు పోతున్నారు? బిల్లు ఎవరిస్తారు?" నింపాదిగా అన్నాడు బాబురావ్ ఆఫ్ 'వన్స్‌మోర్ వీడియోస్'.

"ఎవ్వరికీ వాళ్ల చావు చూసుకోవడానికి వీలు పడదు. నిజమా? కాదా?" అన్నాడు బంగారయ్య క్విజ్ మాస్టర్‌లా.

"నిజమే. ఆ మాటకొస్తే వీపు కూడా" ఆవులిస్తూ అన్నాడు బాబూరావ్.

"మన బంధుమిత్రుల నిజమైన ప్రేమాభిమానాలు మనం పోయాకే తెలుస్తాయి" గొప్ప జీవిత సత్యాన్ని కనుగొన్నవాడిలా అన్నాడు బంగారయ్య.

"మనమే పోయాక ఎవడెట్లా ఏడిస్తే ఏం?"

"ఇంతకీ అసలు విషయం..." చిరాగ్గా అన్నాడు బాబూరావ్.

అప్పటికీ బంగారయ్యకి బుద్ధి రాలేదు. స్వామీ జీవిత సత్యానంద్ అప్రోచ్ మార్చి "రెండుసార్లు హార్ట్ ఎటాక్ రూపంలో ఆ పరమాత్ముడి కొలువులో చేరడానికి ఇంటర్వ్యూ వచ్చింది. కాస్తలో ఫెయిలయ్యాను. మరో కాల్ లెటర్ ఏ క్షణానైనా రావచ్చు. ఈసారైనా సెలెక్ట్ చెయ్యమని పైవాడ్ని ప్రార్థిస్తున్నాను" తన మాటల చాతుర్యానికి తనే మురిసిపోతూ అన్నాడు బంగారయ్య.

"అలాగా! మీకు మరీ అంత అర్జెంట్ అయితే చెప్పండి. నాకు తెలిసిన ఓ డాక్టర్ ఉన్నాడు. అయన చేతిలో పడ్డాక ఆ దేవుడు కూడా మిమ్మల్ని కాపాడలేడు. మీ సెలక్షన్ గ్యారెంటీ. మాట్లాడనా?" అమాయకంగా మొహం పెట్టి అన్నాడు బాబూరావ్.

దాంతో బంగారయ్య చెంపలేసుకుని "నా పేర మిగిలిన ఆస్తిపాస్తులు నా పట్ల నిజమైన ప్రేమాభిమానాలు ఉన్నవాళ్లకి ఇవ్వాలని నా ఉద్దేశ్యం. అందుకే ఈ చావు నాటకం. మీరు కోపరేట్ చేస్తారా... ప్లీజ్' దీనంగా అన్నాడు బంగారయ్య.

బాబూరావ్ సన్నగా వెంట్రుకలా నవ్వుతూ తలూపాడు.

○○○

బంగారయ్యకు సమ్మక్క, సారక్క అని ఇద్దరు కూతుళ్లు. తొందరపడి ఆలస్యంగా వాళ్లకి పెళ్లిళ్లు చేసినందుకు బోనస్‌గా ముక్కామలా, రాజనాలా అనే అల్లుళ్లు ప్రాప్తించారు.

స్థానిక పన్నులు అదనంలా చిన్నా చితకా, మురికీ ముతకా ముష్టి బంధుగణం అఘోరించినా వాళ్లంతా ఎక్స్‌ట్రాలే. మెయిన్ ఎట్రాక్షన్ బంగారయ్య విధవ చెల్లెలు తాయారూ, ఆమెగారి వెధవ కొడుకు- అంబోజీ!

ఆ రోజు.. మధ్యాహ్నం రెండవుతుండగా, ఇద్దరు వస్తాదులు బంగారయ్యని బియ్యం బస్తాలా మోసుకొచ్చి ఇంట్లో పడేసి అరగంట యాగీ చేసి ఐదు వందలు పట్టుకెళ్లారు.

మావని కాకాపట్టి, ఎలాగైనా ఐదువేలు నొక్కేసి రాత్రిళ్లు తనకి క్రమం తప్పకుండా పంకజవల్లి చేసే 'సేవల' తాలూకు 'ఋణం' కొంతైనా తీర్చుకోవాలని ముక్కామల- మావ కోసం ఎదురుచూస్తుండగా, గాద్రేజి బీరువాలా మోసుకురాబడుతున్న బంగారయ్యని చూడగానే కంప్యూటర్ స్పీడ్‌లో సీన్ అర్థమైపోయింది. వెంటనే స్క్రిప్ట్ మార్చేశాడు.

"మావయ్యా!" అని అరుస్తూ మామ పీనుగు వైపు పరిగెత్తాడు.

అప్పటికే నౌకరు నాగులు "బాబుగారూ!" అని ఏడుస్తూ బంగారయ్య మీద పడ్డాడు. కాసేపట్లోనే ఓ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సరిపడా కన్నీళ్లు కార్చేశాడు.

"అయ్యగార్ని లోపల పడుకోబెడదాం సారూ" అంటూ నాగులు చొరవ చేయబోయాడు.

అప్పుడు వచ్చిన రాజనాలతో గుసగుసలుగా "ఈ ముసలి పీనుక్కి అంత సీన్ లేదు. బంగారం లాంటి పక్కబట్టలు నాశనం చేయడం ఎందుకు? దండగ" అని - "ఇప్పుడాయన ఎక్కడ పడుకున్నా ఒక్కటే. ఎలాగూ కాసేపట్లో వచ్చేవాళ్లు దర్శనం చేసుకోడానికి బయట పడుకోబెట్టక తప్పదు. నాగులూ.. వెళ్లి నీ చాప తీసుకురా" లేని కన్నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు ముక్కామల.

నాగులుగాడి చింకిచేప నీచుగబ్బు కొడుతోంది. చాప మీదికి చేర్చగానే బంగారయ్య అప్రయత్నంగా చిన్న జర్క్ ఇచ్చాడు గానీ అదృష్టవశాత్తూ ఎవ్వరూ గమనించలేదు.

అరగంటలో బంగారయ్య మరణవార్త ఆ చుట్టుపక్కల అంతా చికెన్‌గున్యాలా వ్యాపించింది.

ఓ మూల నిలబడి వీడియో కెమెరాలో యాంగిల్స్ సరిచేసుకుంటూ నానా అవస్థ పడుతున్న చాంద్‌పాషాని చూసి రాజనాల "ఎవరు నువ్వు? ఏం చేస్తున్నావ్?" అని జంట ప్రశ్నలు వేశాడు.

చాంద్ పాషా ముఖ సౌందర్యం, వాలకం చూస్తే అతను శవాలు ఎత్తుకుపోయేవాడని ఎవరైనా భావిస్తే అది వాళ్ల తప్పు కాదు.

"వీధీ..వీధీ గుమ్మడి పండు" ఆట ఆడుతున్నట్టు అతను బంగారయ్య వైపు వేలు పెట్టి చూపిస్తూ- "ఈ సాబ్ అయన చచ్చింది. వీడియో తియ్‌వాలా అని మాకీ చెప్పింది. హద్కు మాకీ వచ్చినయ్. హాయన మాకీ ఇచ్చిన లెటర్, బయానా రశీద్.. చూస్కోండ్రి" తెలుగుభాషని అరెబ్బీ యాసతో మాట్లాడి రాజనాలకి ఓ ఉత్తరం, రశీదు ఇచ్చాడు.

ఇంతలో సారక్క అక్కడికొచ్చి విసురుగా లెటర్ తీసుకుని గబగబా చదివింది.

తన చావుని వీడియో తియ్యమని లెటర్‌లో స్పష్టంగా ఉంది. రశీదులో ఐదువేల ఎడ్వాన్స్ ఇచ్చినట్టు మరో పది వేలు ఇవ్వాల్సి ఉన్నట్టు చూసి ఆమె భగ్గుమంది. చచ్చినోడి పెళ్లికి వచ్చిందే పదివేలని విన్నాం గానీ ఇలా పదివేలు మనకి క్షవరం కావడం ఏమిటి? ముసిలాడికి ఖచ్చితంగా పిచ్చెక్కింది. లేకపోతే చచ్చాక వీడియో తియ్యమనడం ఎక్కడి విడ్డూరం?

"ఇచ్చిన అడ్వాన్స్‌కి ఎంత వస్తే అంత తియ్ చాలు. అయినా చచ్చినోడికి తీసిందే చాలు" అంది ఈసడింపుగా. వచ్చిన వాళ్లు బంగారయ్యని చూడ్డం మానేసి ఈ తతంగం అంతా పాము-ముంగీసాటలా ఆసక్తిగా గమనించసాగారు.

“అబ్బా మీది...నాకీ..చెప్పు” అంటూ తెలుగుభాషని మరో మారు ఖైమా కింద కొట్టే ప్రయత్నం చేయబోతున్న చాంద్ పాషాకి ఆ అవకాశం ఇవ్వకుండా “అలాగే.. ఇస్తాం.. మీరు తియ్యండి” అన్నాడు ముక్కామల కల్పించుకుంటూ.

“తండ్రి సంపాదించిన లక్షలాస్తి నూకుతూ ఆయన ఆఖరి కోరిక తీర్చడం కోసం ముష్టి పదివేలకి కక్కుర్తి పడ్డారని తెలిస్తే పోటీలు పడి జనాలు మన మీద ఉమ్మేస్తారు. నోరు మూసుకోండి” అని సమ్మక్కతో పాటు సారక్కను కూడా కసిరాడు ముక్కామల.

తాయారు వస్తూనే కల్తీ కల్లు తాగిన దానిలా కళ్లు తేలేసి “అన్నయ్యా” అంటూ బంగారయ్య మీద బోల్లా పడింది. అంబాజీ కూడా సాయంగా ఏడుస్తూ బంగారయ్య మరో ప్రక్కన పడి ఇదే సందు.. అదే మందనుకుని బంగారయ్య బ్రేస్‌లెట్ కొట్టేశాడు.

లేచి అంబాజీగాడ్ని చావ బాదాలనిపిస్తున్నా తన పాత్ర ‘ఔన్నత్యం’ దృష్ట్యా లోలోపలే పళ్లు కొరుక్కుంటూ ఉండిపోయాడు.

ఎవ్వరికీ అనుమానం రాకుండా జనాలు మరీ బంగారయ్య మీద అదే పనిగా పడి ఏడ్చి నాటకం రసాభాస కాకుండా బాగా ఆలోచించి బాబూరావ్ ఓ చచ్చిన, మేడ్ ఇన్ ఇండియా ఎలుకని బంగారయ్య మొలతాడుకి ముడేశాడు. ఆ ‘పవిత్ర బంధం’ వల్ల బంగారయ్య బాడీ మన రాష్ట్ర అసెంబ్లీ కన్నా ఎక్కువ కంపు కొట్టసాగింది.


‘ఎలుక పరిమళం’ వల్ల ఎవ్వరూ శవాన్ని సమీపించే దుస్సాహసం చేయలేక.. దూరం నుంచే శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు.

కానీ తాయారు.. అంబాజీలు కారణజన్ములు! అకారణంగా వారే పనీ చేయరు.

ప్రస్తుతం కూడా బంగారయ్య వొంటి మీదున్న మొత్తం బంగారం కాజేసే మహత్తర ఆశయంతోటే వాళ్లు అన్ని కంపులకి అతీతంగా, భూదేవంత ఓర్పుతో, గజదొంగలంత నేర్పుతో తమ పని తాము చేసుకుపోతున్నారు.

“మావయ్య చచ్చి ఎన్ని రోజులైందే.. మురుగు కంపు కొడుతున్నాడు” ఊపిరి బిగబట్టి ముక్కుతూ అన్నాడు అంబోజీ.

“నాకు మాత్రం ఏం తెలుసు? వచ్చిన పని చూడ్రా.. నువ్వా నాలుగు ఉంగరాలూ ఊడబీకు. నేనీ గొలుసు సంగతి చూస్తాను”



పళ్ల బిగువున గీతోపదేశం చేసింది కొడుక్కి.

ఆక్సిజన్ ట్యాంక్ ఖాళీ అయిన స్క్యూబా డ్రైవర్స్‌లా, ప్రాణాలకి తెగించి వాళ్లు ఎలాగో 'ఆపరేషన్ గోల్డ్' ప్రోగ్రాం పూర్తి చేశారు.

తాయారూ వాళ్లు డ్యూటీ దిగీ దిగగానే కూతుళ్ల బ్యాచ్ బంగారయ్య మీద పడబోయారు.

"ముసిలాడు మనం పంపే వరకూ ఎక్కడికీ పోడు గానీ ముందు లోపలికెళ్లి ఆ నగదూ గట్రా సంగతి చూడండి. అది ముఖ్యం" కసిరాడు రాజనాల.

ఒలింపిక్ రన్నర్స్‌లా అక్క చెల్లెళ్లిద్దరూ లోపలికి పరిగెత్తి అన్ని సూట్‌కేస్‌లూ వెదికారు. గిట్టుబాటు కాలేదు. పేరక్క కట్లపాములా మంచం కిందకి పాకి వెదికింది. ఆ తర్వాత పరుపులూ తలగడలూ చింపి పోగులు బెట్టారు. ఫలితం శూన్యం!

సమ్మక్క ఈలోగా మిగతా అన్ని చోట్లా వెదికింది. రిజల్ట్ డిటోయే! మిగిలిపోయింది గాడ్రేజీ బీరువా మాత్రమే. అది లాక్ చేసుంది. తాళం చెవి తప్పకుండా నాన్న జుబ్బా జేబులో ఉంటుంది. ఇప్పుడెలా? దిగులుగా అంది సమ్మక్క.

"స్నానం చేయించడానికి చొక్కా విప్పుతారుగా. అప్పుడు అవి పట్టేద్దాం" అంది సారక్క.

ఆమె తెలివికి అబ్బురపడింది సమ్మక్క. దీనికి కొంపలు ముంచే చావు తెలివి ఉండబట్టే తన కన్నా రెట్టింపు ఆస్తి నాన్న దగ్గర్నుంచి రాబట్టింది అని లోలోపల తిట్టుకుంది కూడా. అది వేరే సంగతి.

"నాన్న వొంటి మీద చాలానే బంగారం ఉండాలి కదే" అంది సమ్మక్క సాలోచనగా.

"అవునే.. అన్నట్టు ఆ ఆరు తులాల బ్రేస్‌లెట్ మాత్రం మాకే. మా వారికి అలాంటిది చేయించుకోవాలని ఎప్పట్నుంచో ఆశ! పైగా ఆయనకది బాగా నప్పుతుంది" అంది సారక్క.

"ఆ గొలుసు మా రాణికి. పైగా నాన్నే స్వయంగా తనే దానికి ఇస్తానన్నాడు" పచ్చి అబద్ధం ఆడుతూ అంది సమ్మక్క.

"అయ్యో.. ఆ మహాతల్లి తాయారమ్మ సంగతే మరచిపోయాం. అది ఏకంగా నాన్న శవాన్నే మాయం చేయగలదు" అంటూ సారక్క గబగబా బైటికి పరిగెత్తింది.

ఒక్కసారి తండ్రి వైపు పరీక్షగా చూసి జరిగిన నిలువుదోపిడీ అర్థమై నిజంగానే గుండెలు బాదుకుంటూ ఏడవసాగారు.

"శవం మీద పడి ఏడ్చి చావండి!" అని రాజనాల ముక్కామలా కోరస్‌గా అరిచారు.

దాంతో వాళ్లు ఎనుబోతు మీదికి దూకే ఆడ శివంగుల్లా తండ్రి మీదికి దూకి.. కంపుకి తల గిర్రున తిరగడంతో స్లోమోషన్‌లో పక్కకి దొర్లారు.

చూడ్డానికి వచ్చిన వాళ్లందరూ ముక్కు, నోరూ మూసుకుని శవం దగ్గర ఐదు సెకండ్లు కూడా నిలబడలేక రొప్పుతూ బైటికి పరిగెత్త సాగారు.

పాపం! నాగులు మాత్రం బంగారయ్య కాళ్ల దగ్గరే కూలబడి ఏడుస్తున్నాడు. శవం కంపు. అతని మీద ఎలాంటి ప్రభావం చూపించలేదు. అందుకు కారణం అలాంటి వాసనే అతని దగ్గరా వస్తూ ఉండటం వల్ల అలవాటై ఉండొచ్చు.

లోకం కోసం మామ మీద తనకున్న ప్రేమాభిమానాలు తెలియజెప్పాలనుకుని రాజనాల వొంగి పూలదండ శవం మీద ఉంచబోయి గుప్పున కొట్టిన కంపువాసనకి కళ్లు తిరిగి పూలదండ తన మెడలోనే వేసుకుని పక్కనున్న తాయారు ఒడిలో పడ్డాడు.



మా నాన్నని మావగారిలా కాక కన్నతండ్రిలా భావించేవార్ధు. "అయ్యో.. మీకసలే హై బీపీ జాగ్రత్త" అంటూ సారక్క మొగుడ్ని లేవదీయబోయి పట్టు దప్పి రాజనాల మీదరోడ్డు రోలర్‌లా పడింది.

దాంతో బ్రతికుండగానే పూడ్చబడి ఎలా ఉంటుందో రాజనాలకి అనుభవమై ఆ అనుభవం శాశ్వతం కాబోతుండగా హైలెస్సా! ఓలెస్సా! అంటూ నలుగురు ఆమెని పక్కకి ఈడవడంతో రాజనాల కళ్లు తెరిచాడు.

ఈసారి తెలివిగా దూరం నుంచే దండ శవం మీదికి విసిరి దండం పెట్టుకున్నాడు.

## గజల్ వింటే 'గుస్సా' రాదు

మీడియాలో తన గురించి రకరకాల పుకార్లు విన్నప్పుడల్లా నయనతారకి తెగ 'గుస్సా' (కోపం) వస్తుందిట. కానీ వూరికే ఎక్సయిట్ అయిపోయి అవస్థ పడేకన్నా కామ్‌గా వుండడం మేలు అని కూడా భావిస్తుందిట. అయితే తనకి ఏ సందర్భంలో అయినా కోపం వస్తే చల్లబడేందుకు హరిహరన్ లాంటి వాళ్లు పాడిన గజల్స్‌ని వింటూ కూర్చుంటుందిట. అంతే, మనసంతా ప్రశాంతంగా మారిపోతుందిట.

ఇంతలో ఆ వీధికి పెద్ద ముత్తయిదువు చాదస్థాల పుట్ట అయిన భక్త శబరి రంగప్రవేశం చేసింది.

"అయ్యో.. అయ్యో... చెట్టంత మనిషి శవం నట్టింట పెట్టుకుని గోరంత దీపం వెలిగించాలనే ఆలోచనే ఎవరికీ లేకపోయింది. కలికాలం!" అంటూ ఆమె ఆ ఇంటి ఇల్లాలు కాకపోయినా సదరు దీపం తనే వెలిగించింది.

ఇంతలో చాంద్ పాషాకి పోయే కాలం దాపురించి తన పనేదో తను చూసుకోకుండా అనవసరంగా కల్పించుకుని "లైట్ ఉన్నయ్. ఆ దీపం బుడ్డి ఎందుక్కా? దండగ" అన్నాడు. అంతే! శబరి ఇచ్చిన కోటింగ్ దెబ్బకి మంకీ గున్యాతో పాటు డెంగ్యూ జ్వరం, ఒకేసారి తగులుకున్నాయి. లోకం అంతా ఎర్రగా మనుష్యులు మరీ పొడుగ్గానో చాలా గుండ్రంగానో కనిపించసాగారు చాంద్ పాషాకి.

"ఏదో హేలు నిండినది. ఆట మొదలైనది" అన్న రీతిలో "రావాల్సిన వాళ్లంతా వొచ్చినట్టేగా. ఇక మావ

య్యకి స్నానం చేయించే కార్యక్రమం మొదలుపెడదాం. రా తమ్ముడూ నువ్వు ఓ చెయ్యెయ్యి" రాజనాలని పిలిచాడు ముక్కామల.

వీడియో తీస్తున్నారని గమనించి జనాలు ముఖ్యంగా ఆడంగులు.. శవం కంపు సంగతి మరిచిపోయి సాధ్యమైనంత ఎక్కువ సేపు వీడియోలో పడడానికి పోటీలు పడసాగారు. కొందరు బాత్‌రూంలోకి దూరి ఫ్రెష్‌గా తయారవుతుంటే మరికొందరు ఏకంగా "ఛీ.. ఈ పాడు శవం ఒకటి.." అని బంగారయ్య బాడీ కనిపించకుండా కుర్చీలూ సోఫాలూ వగైరా అడ్డంగా లాగసాగారు.

ఆ కాసేపు చాంద్ పాషా చిరంజీవి లెవెల్లో వెలిగిపోయాడు. "ఆ గుంటల్ని కనిపెట్టుండు ఫో!" అని తాయారు కర్తవ్య బోధ చేయగానే, అంబాజీ బెడ్‌రూంలోకి పరిగెత్తి ఓ మూల నక్కాడు.

మరోపక్క చాలామంది తిప్పలు పడ్డాక గానీ బంగారయ్య జుబ్బా ఊడిరాలేదు. వెంటనే అదేదో స్వామి వారి శేష వస్త్రమైనట్టు సారక్క అది తీసుకుని లోపలకి ఉడాయించింది.

"పాపం! పిచ్చిపిల్ల వాళ్ల నాన్నని అలా చూడలేక..." అనుమానంగా చూస్తున్న వాళ్లకి క్లారిఫికేషన్ ఇచ్చాడు ముక్కామల పళ్లబిగువున.

"మా నాన్నంటే దానికి చచ్చేంత ఇష్టం" అంది సమ్మక్క ఎండిపోయిన ముక్కు చీదుతూ.

"మరే.. ఛస్తే ఇంకా ఇష్టం" గొణిగింది తాయారు.

"ఆలస్యమవుతోంది. ఊ...ఊ. త్వరగా కానివ్వండి. నీళ్లు పోయండి" అంది తాయారు.

ఇలాంటి విషయాల్లో అంతగా అనుభవం లేని ఓ పిచ్చి పేరిందేవి చొరవగా నాలుగు చెంబుల నీళ్లు తాయారు మీద కుమ్మరించింది.

తాయారు స్లోమోషన్‌లో వెనక్కి తిరిగి పిచ్చి పేరిందేవి చెవిలో అరనిమిషం పాటు ఏదో చెప్పింది. అదేంటో గానీ వెంటనే పేరిందేవి నురగలు కక్కుకుంటూ విరుచుకుపడిపోయింది.

లోపల అక్కా చెల్లెళ్లిద్దరూ అర నిమిషంలో బీరువా తెరిచి ఆత్రంగా అన్ని మూలలూ గాలించగా ఒక్క గాంధీగారి బొమ్మ ఉన్న కాగితం కూడా కనిపించలేదు. ఓ సీల్డ్ కవరు కనిపించింది. అందులోని ఉత్తరంలోని సారాంశం బంగారయ్య తీర్చాల్సిన బాకీల వివరాలూ ఇల్లు తనఖా పెట్టి బ్యాంకు నించి తెచ్చిన అప్పులూ వగైరా పోగా ఏమైనా మిగిలితే తన పేర 'అమ్మదయ' గుడికి విరాళం ఇవ్వమని ఉంది"

సమ్మక్క, సారక్క మనస్ఫూర్తిగా గుక్కపెట్టి ఏడవసాగారు. సందట్లో సడేమియాలా అంబాజీ ప్రత్యక్షమై "పేరక్కా.. ఏముంది అందులో?" అన్నాడు కుతూహలంగా.

"నీ శ్రాద్ధం ఉంది. ఆ ముసలిపీనుగతో పాటు నిన్ను తగలెయ్యమని తన ఆఖరి కోరికగా రాశాడు. తప్పేట్టు లేదు" కసిగా అంది సారక్క.

వెంటనే అంబాజీ బిన్ లాడెన్‌లా మాయమయ్యాడు. ఇంతలో బైటకొచ్చారు. బంగారయ్య తన కొత్త చొక్కా తనే స్వయంగా తొడుక్కుంటూ కనిపించాడు.

బ్యాండ్ మేలగాళ్లు, పాడె కట్టడానికొచ్చిన వాళ్లు దేవుడు లేడని పళ్లు నూరుకుంటూ వెళ్లిపోయారు.

బంగారయ్యకి అప్పులిచ్చిన ఒకరిద్దరు ఆనందంతో బంగారయ్యేదో ఐశ్వర్యారాయ్ అయినట్టు కావలించుకుని దేవుడు రెండుసార్లున్నాడనుకున్నారు.

మర్నాడు బాబూరావు వీడియో టేప్‌లు బంగారయ్యకి ఇచ్చాడు. ప్రతి రూంలో ఏర్పాటు చేసిన సీక్రెట్ కెమెరాలలో ప్రతి విషయం ప్రతి నిమిషం కళ్లకి కట్టినట్టు చిత్రీకరించబడింది.

తన వాళ్ల నిజస్వరూపాలు బట్టబయలు అయినందుకు బంగారయ్య చాలా బాధపడ్డాడు. నిజానిజాలు తెలిసినందుకు ఒక రకంగా సంతోషించాడు.

వెంటనే లాయర్‌ని పిలిచి తన యావదాస్తీ నౌకరు నాగులు పేర రాశాడు.

పది రోజుల తర్వాత గుండెపోటుతో బంగారయ్య నిజంగానే చచ్చిపోయాడు.


బంగారయ్య దశదినకర్మ చాలా గ్రాండ్‌గా జరిగింది.

వచ్చిన అతిథులందర్నీ సాగనంపుతూ ఆఖర్న ఓ వ్యక్తికి ఓ బ్రీఫ్ కేస్ ఇచ్చాడు నౌకరు నాగులు.

మాస్టర్ ప్లాన్ వేసి నాగుల్ని హీరోని చేసి బంగారయ్య యావదాస్తి కట్టబెట్టిన ఆ వ్యక్తి నవ్వుతూ బ్రీఫ్‌కేస్ అందుకున్నాడు.. అతను.. బాబూరావ్!

○

(నీతి: మనిషి ఒక్కసారి చావడమే ఉత్తమం!!!
-రచయిత)



## క్షణక్షణముల్...

దాదాపు నాలుగేళ్ల క్రితం తను షాహిద్ కపూర్‌ని ప్రేమిస్తున్నట్టు పబ్లిగ్గా చెప్పింది కరీనా కపూర్. ఆ తర్వాత కొన్ని సందర్భాల్లో షాహిద్‌ని ముద్దాడి సంచలనం కూడా సృష్టించింది. కాబోయే భర్తే కదా అనుకున్నారంతా. కానీ తాజాగా మేమిద్దరం విడిపోతున్నాం అంటూ సెలవిచ్చిన కరీనా కపూర్ తమ ప్రేమకు వీడ్కోలు అన్నట్టుగా వాళ్లిద్దరూ కలిసి నటించిన తాజా చిత్రం 'జబ్ వి మెట్' సినిమాలో గాఢమైన ముద్దు సీన్ కూడా ఇరికించారు. ఇప్పుడు సైఫ్‌తో దోస్తీ కట్టిన కరీనా కపూర్ నిజంగా ఎవర్ని ఎప్పటికి పెళ్లాడుతుందో!